
ఈవారం కథ

# మేక

## -రాము సురేంద్రబాబు



**కాలే కడుపులో ఆకలిలా ఎండ మండిపోతోంది. ఎండ పడి నల్లత్రాచులా మెరుస్తోంది తారురోడ్డు. నిప్పులు మండే ఎండ తీవ్రతలకు ఆవిర్లు వేస్తున్నాయి.**

లయబద్ధంగా చెట్ల తోపులోంచి అరుస్తున్న చింతగీర్ల రాగాలకి ఒంపు తిరుగుతున్న రోడ్డు ప్రక్క వేప చెట్టు క్రింద ఓరగా కావడి బద్ద ఆనించి, చెట్టు మొదలుకి చేరగిలబడి కునుకు తీస్తున్న కొప్పరోడు ఉలిక్కిపడి లేచాడు. "టప్..." మంటూ భుజం మీద పడ్డ కాకిరెట్ట తాకిడికి.

తలెత్తి మీదకు చూసేడు. అంతవరకూ ఎండలో నీటి బొట్టుకోసం తిరిగి ... తిరిగి అలసిపోయి, ఒక్క చుక్క కూడా నీరు దొరక్క చెట్టు కొమ్మపై వాలిన కాకి, దిక్కులు చూస్తోంది "కా ... కా..." అని అరుస్తూ.

కాకిని తిట్టుకుంటూ తుప్పల్లోని ఆకు తెంపి భుజం తుడుచుకున్నాడు. నాలుగడుగులు రోడ్డు మీదకు నడచి ఎండకు చెయ్యి అడ్డుపెట్టి దూరంగా చూసేడు. బస్సొచ్చే జాడలేదు.

"ఎప్పుడికీ రాదే హెయిప్ బస్సు" అని విసుక్కుని బుర్ర గోక్కుంటూ వచ్చి యథాస్థానంలో కళ్ళు మూసుకున్నాడు.

ఎండ మండి పోతుంటే ఎలిప్పిసి తోలుకొస్తున్నారు రైతులు.

"అబ్బ!... అంబల్లేల దాటిపోనాది. దుక్కిలో లెలిపోత్తను. పెందిలెలిపోచ్చినాను, సల్లందైనా తిన్నేదు ... ఆ కాడికీ తల్లమ్మన్నాది ...

"ఓరి గండా సల్లంది తినకుంటెల్లకురా, యీటలొట్టిపోయి సవ్వగలవని. అయినా నాయుడు తాత గాభరా బెట్టిత్తే గభీల్న పారొచ్చినాను. తాత 'టీ' నీలుకైనా పావల్దబ్బులిచ్చినాడు గాదు. ఆ ఉసమ్మ ఎంతేల కొత్తాదో. ఏటో ... తల్లెమ్మ సెప్పినట్టే ఈవలకి నాలిక పిడస గట్టిపోతూంది. ఒక సెనం నూతికెల్లి బుక్కాడు నీల్తాగి గభాల్ని పారొత్తాను" అనుకుంటూ నూతివైపు వెళ్ళాడు.

***

కొప్పరోడిది ఆ రోడ్డుకి మూడు మైళ్ళ దూరానున్న పల్లెటూరు. తల్లి చచ్చిపోయింది తండ్రున్నా పెద్దగా పట్టించుకోడు. ఏమి పెట్టినా, పెట్టకపోయినా, ఎవరేమన్నా నాయుడింటి కాడనే కనిపెట్టుకుమంటాడు.

"ఆంజనేయుడి లాగ ఆడి శక్తి ఆడికి తెలియదు" అనుకుంటారు. ఆ ఊరి జనం. వాడి గురించి. నాయ్డు బావు చెప్పాలి గాని నిద్రా నీరూ లేకుండా కొండ మోసుకు రమ్మన్నా మోసుకొస్తాడు. నాయుడు బావు వాణ్ణి 'పకీరూ' అని పిలిస్తే కొండంత సంబరపడిపోతాడు. అలగ పిలవడానికి వాడికి చిన్న 'ఫ్లాష్ బ్యాక్' వుంది. ఇంకెవరూ వాడిని అలాగా పిలవరు. వాడి తల్లి పెట్టిన పేరు కొప్పరి పకీరు నాయుడు. కొప్పరోడి తల్లి నర్సమ్మకు ముందు సంతానం దక్కలేదు. అయితే పల్లెటూళ్ళలో ఒక నమ్మకం వుంది. పుట్టిన పిల్లలు దక్కకుండా పోతుంటే ఆ తరువాత పుట్టిన పిల్లలకు ఏవో "తాడు... ధూళి ... ఫకీరు" లాటి పేర్లు పెడితే ఆ సంతానం తప్పకుండా నిలబడుతుందని. అందుకే నర్సమ్మ వాడికి అలాంటి పేరు పెట్టింది.

బ్రతికున్నప్పుడు నర్సమ్మ వాడినెప్పుడూ 'పకీరూ' అనే పిలిచేది. ఇప్పుడు నాయ్డు బావు తప్ప మిగతా వాళ్ళందరూ ఇంటి పేరు పెట్టి 'కొప్పరీ... కొప్పరీ' అనే పిలుస్తుంటారు. ఆంజనేయుడికి, శ్రీరాముడి లాగ ఈడికి నాయ్డు బావు తప్ప మరొకల లక్ష్యం లేదు. ఎవరే పని పొరపాటున చెప్పినా వాడికి నచ్చితే వెంటనే

చేస్తాడు. వాడు కాదు అన్నాడంటే, అంతే మరి "ఈడొట్టి తిక్క ముండా కొడుకురా" అనేసి వదిలేస్తారు.

"కొప్పరోడు తల్లి నర్సమ్మ బతికుంటే ఆడి బతుకెలాగుండేదో గానీ, ఆడు సేసిన కట్టానికి ఇంకొక్కా డెక్కడయినా అయితే, ఒకనాడు కట్టం జేస్తే రెన్నాళ్ళు కూర్చోని తినొచ్చు..." కొప్పరోడి కష్టం చూసి అప్పుడప్పుడూ ఆ ఊరి వారు అనుకునే మాట.

నాయుడోరింటి దగ్గర మూడు పూటలా ఇంత పిడస పడేసి కాసిన్ని 'టీ' నీలు ఓ పావలా డబ్బులు బీడీల కిచ్చేస్తే వాడికి వెన్నెలకీ ఎండకీ తేడా తెలీకుండా, దాచుకోకుండా ఒళ్ళొంచు తాడు. నిజం చెప్పాలంటే నాయుడు బావుకి అలాంటి పనోడు దొరికినందుకు (తేరగా) ఊర్లో కొందరు మోతుబరి రైతులు ఈర్ష్యపడతారు కూడా. సమయము దొరికితే అవీ... ఇవీ రెండు పోటికీలు కూడా చెప్పేవాళ్ళు. అయితే కొప్ప రోడు మాత్రం ...

"బావు ఆలలగన్నారు ... ఈలిలగన్నారు" అని తిరిగి నాయ్డుతోనే చెప్పేవాడు. అప్పట్నుంచి వాడికి ఎవరూ ఎలాంటి మాటలు చెప్పడానికీ సాహసించరు.

నర్సమ్మ వున్నప్పుడు కొడుకుని మహారాజు లాగా పెంచాలనుకునేది. నర్సమ్మకి ముందు ఆస్తి బాగానే వుండేది. డబ్బులు వాయిదాలకిచ్చేది. ఎవరో బండో ... బక్కో కొనుక్కుంటామంటే అప్పిచ్చేది. భూమీ పుట్రా ఏమీ వుండేది కాదు గాని, చిన్న ... చిన్న బంగారు వస్తువులు ఇత్తడి సామాన్లు లాంటివి పద్దు పడుతుండేది. ఆ ఊరి బడికి పై ఊరి నుంచొచ్చే మాష్టార్లకి ఎంతోకొంత పైకం తీసుకుని భోజనాలు పెడుతుండేది. అయితే నర్సమ్మ కూడా బులుపుల బుచ్చమ్మే. ఎవరేటి కొడుకు గురించి నాలుగు మాటలు "నీ కొడుకు అంతోడవుతాడు ... ఇంతోడవుతాడు" అంటే మాత్రం వాళ్ళేదడిగినా లేదనకుండా ఇచ్చేసేది. ఊర్లో చాలామంది ఆ అవకాశాన్ని విని యోగించుకున్నారు. ఎంత గడుసుదయినా కొడుకు మీద ప్రేమకొద్దీ ఆ విషయంలో మాత్రం అమాయకంగా ప్రవర్తించేది. ఆ అమాయకత్వమే ఆస్తులన్నీ అప్పుల్లో ముంచి ఇల్లూ, ఒళ్ళూ గుల్ల చేసింది.

నటుడైన 'విలియం జిల్లెట్, శీఘ్ర లిపిని నేర్చుకునే 'షార్ట్ హ్యాండ్' సమయంలో - ప్రతిసాయంత్రం- తాను ఉన్న బోర్డింగ్ హౌస్‌కు దగ్గరున్న జనుల సంభాషణలు వ్రాసుకునే వాడు. నాలుగు నెలల తర్వాత, తన మిత్రునితో ఇలా అన్నాడు. "నాలుగు నెలలు విడువకుండా ప్రజల సంభాషణలను వ్రాసుకున్నాను. ఒక్కరూ కూడా ప్రయోజన కరమైన మాటలు మాట్లాడలేదు" అన్నాడు.

తానున్నంత వరకూ మాత్రం కొడుకుని ఎవరైనా 'కొప్పరీ' అని పిలిస్తే అగ్గిమీద గుగ్గిలమై పోయేది. మంచి బట్టలేసి పైసో పరకో కొను క్కోవడానికిచ్చి, పలకా, బలపము చేతికిచ్చి పంపేది. తన కొడుకు పెద్ద చదువు చదవాలనీ, వాడికి బాగా చదవు చెప్పమనీ మాష్టార్లందరికీ పదే పదే చెప్తుండేది. నర్సమ్మ పై ఊరి నుండి వచ్చే మాష్టార్లకి రోజూ గుడ్లు, మాంసాలతో మంచి భోజనము ఏర్పాటుచేసి తన కొడుకు గురించే అడిగేది.

"బాబూ మా పకీరు తెలివైనోడేనా ... ఆడు పెద్ద సదువులు సదువుతాడు కదా ... సెకెను పారమైతే ఆడ్ని పట్నంల మీరే పెద్ద బళ్ళో సేర్పించాలి" అనేది.

మాష్టార్లు కూడా (భోజనం మొహమాటా నికి)

"నర్సమ్మా నిజంగా నువ్వు అదృష్టవంతు రాలివి. అలాంటి కొడుకుని కన్నందుకు. పకీరు గొప్ప తెలివైనోడు. ఆడు ఇస్త్రీ బట్టలేసుకుని బడి కొస్తే గొప్పింటోళ్ళ బిడ్డలాగుంటాడు.

ఎప్పటికైనా పకీరు గొప్ప చదువు చదివి పెద్ద ఆఫీసరవుతాడు. అప్పుడు నువ్వు మా రాజు తల్లిలాగ వుండొచ్చు..." అని ఏవేవో చెప్పి నర్సమ్మని ఆనంద పెట్టేసేవాళ్ళు.

నర్సమ్మ వాళ్ళ మాటలకు పొంగిపోయి డబ్బుల సంగతే పెద్దగా పట్టించుకునేది కాదు.

అప్పటివరకూ అందలం మీదున్న పకీరు: అదృష్టం ఆకాశం కేసి చూసి బోర్లాపడింది. పక్ష వాంతో నర్సమ్మ హఠాత్తుగా కన్ను మూసింది. అప్పటికే ఆస్తి హారతిలా మెల్లగా ఆరిపోయింది. కొద్దో, గొప్పో ఇవ్వవలసిన వాళ్ళంతా చల్లగా జారు కున్నారు. నివాసం పెంకుటింటి నుండి పాకలోకి చేరింది. ఊర్లోవారి పిలుపు 'పకీరూ ... నుండి ... కొప్పరీ"కి మారింది. కొప్పరోడికి బడి దూరమయింది చదువు మాయిమయింది. మొద ట్నుండీ తండ్రి వున్నా లేని జమే. అయినా తప్పదు కాబట్టి ఊర్లో కొంతమంది మంచోళ్ళ సలహా మీద టీ దుకాణం పెట్టాలనుకున్నాడు. చేతిలో డబ్బు లేదు. విషయం నాయుడు బాబుకి తెలిసింది. ఓ పులి బుర్రిచ్చి టీ కొట్టు పెట్టుకో మన్నాడు. కొప్పరోడు తన దగ్గరేవుంటా డన్నాడు. అప్పట్నుండి అలాగే ఆ ఇంట కొప్ప రోడికి అలవాటయింది. మరింత వరకూ గూడ ఆడికి ఒకరి గడప తొక్కడం తెలీదు. వేళకింత తినడం, చెప్పినంతా పని చెయ్యడం తప్పితే ఆడికింకేమీ పట్టదు.

***

అప్పటి వరకూ వాహనాల మీద లగేజీ మూట్లలోంచి రోడ్డు ప్రక్కలకి జారిన గింజలు ఏరుకుంటున్న కాకులు "గుర్రు...ర్రు... ర్రు..." మంటూ వస్తున్న బస్సు శబ్దానికి అరుస్తూ గాల్లోకి లేచాయి. అల్లంత దూరానున్న కొప్పరోడు బస్సు శబ్దం వింటూనే...

"ఓలమ్మో! బస్సు నాగుంది" అంటూ పరుగు పరుగున రోడ్డు చేరుకున్నాడు. బస్సా పేదు డ్రైవరు. సీటు క్రింద సర్దిన సంచులు రెండూ, రెండు చేతుల పట్టుకుని లాల్చీకింద గల్లాలాంటి పెద్ద నిక్కరేసుకుని బస్సు దిగేడు షావుకారి. కండక్టరు 'రైట్' అంటూ పంచింగ్ కత్తెరతో 'టంగ్ ... టంగ్' మని రాడ్డుకి కొట్టేడు. పోనీమన్నట్లు, షావుకారి గాభరాపడి పోయేడు.

"బాబ్బాబు ... నా మూటడబ్బా వుంది. ఆపండాపండి, తీసుకోవాలి" అంటూ పరు గెత్తాడు. డ్రైవరు స్టార్ట్ చేసినవాడల్లా బ్రేకేశాడు. కండక్టరు మాత్రం తిట్టుకున్నాడు.

"లగేజి ఎయ్యిమెయ్యి మంటే ఏసేవరకు మా ప్రాణాలు తీస్తారు. దిగినప్పుడేమో గంటల తరబడి చేస్తారు. . . వేగిరం దించవయ్యా..." అంటూ కసురుకున్నాడు. మూటె డబ్బా తీసుకుని దిగేడు షావుకారి.

బస్సులోంచి మరెవరూ దిగకపోవడంతో బస్సులోంచి దిగిన షావుకారిని చూసి...

'శెన్నాగ ఈ షావుకారి దిగినాడే హెయిస్.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

పోనాయమ్మాలు పట్నంలగుపడ్డారేటో అడుగుతాను'' అనుకుంటూ షావుకారి కెదురెళ్ళాడు.

''అవునోయ్ సుబ్బయ్యా, పట్నంల ఉసమ్మాలు గాని అవుపించి నారేటి'' షావుకారి నడిగేడు.

''ఆ... ఆ... కనిపించినార్రా కొప్పరీ ... అయినాలింత బేగొత్తారన్నట్టు నేదు. ఆ లొచ్చే సరికి పొద్దు ... పోద్దేటో...''

మెల్లగా ఎలాగయినా తన సామాన్లు కొప్పరోడి చేత మోయించుకెలిపోడానికన్నట్లు ప్లానేస్తూ సందేహం వెలుబుచ్చి మీదకు మాసేడు. ఎండ తీవ్రంగా వుంది.

''దీనెంబడి బస్సు ఎంతేలకొత్తాదేటి'' అడిగేడు కొప్పరోడు.

''ఈ ఆర్.టి.సి. బస్సులెంత ఏలకొత్తాయో ఎటో సెప్పనేమురా. ఇంతకుముందు నాక్కాదు. అప్పడంటే పయివేటు బస్సులు. ఏ ఏలప్పడే బస్సుండేదో తెలిసేది. అయినా ఆలొత్తే వుంటారు గాని ఈ ఎండ కంతకీ దొక్క మాడ్సుకునేటుంటావు. ఇల్లీ దుకానంల ఒక్క టీ తాగేసీ ఈ సామాన్లెట్టుక్కోరా. ఎల్లోద్దుము. కాక పోతే ఒక్కడుగు సల్లబడ్డాక మళ్ళీ బేగి పాలొద్దువు గానీ'' నక్క ప్రేమ వెలుబుచ్చేడు షావుకారి.

''ఉండవోయ్ నువ్వొకడవి. ఈ ఎండకంతకీ ఇన్ని సుట్లు ఎవులు తిరుగుతారు'' కసురుకున్నాడు.

''నువ్వోట్నే ఎలిపొచ్చేవక్కర్లేదునేరా మూడ్రూపాయిలిత్తాను'' అనునయంగా ఆశ చూపేడు షావుకారి.

''పుండు మీద పుల్లపోట్నాగ నువ్వేటోయ్ నాన్నానంతే పదీసార్లు పిలుత్తావు. నువ్వు మూడ్రూపాయిలు కాదు గదా ముప్పయి రూపాయిలిచ్చినా నాన్నాను. నన్నిసిగించక ఎవుల్నైనా సూసుకో'' అని కోపంగా చెప్పేసరికి

''కొండముండా కొడుకు డబ్బులిత్తామన్నా రాడు'' అనుకుంటూ మెల్లగా వెళ్ళిపోయేడు షావుకారి.

కొద్ది కొద్దిగా ఎండ చల్లబడింది. కొప్పరోడికి మాత్రం కడుపులో పేగులు తోడేస్తున్నాయి ఆకలికి.

బస్సొచ్చి ఆగింది. కొప్పరోడు సంతోషంగా ఊపిరి పీల్చుకున్నాడు. పరుగునా వెళ్ళి బేగులు, సూట్ కేస్, మూటలు అందుకుని కావట్లో పెట్టాడు.

''ఏందమ్మా పట్నంల అప్పగోరింటెగ్గానెల్నారేటి ఆలిసిమయిపోనాది'' పలకరింపుగా అన్నాడు.

''అవున్రా, నువ్వెప్పట్నుంచి ఉన్నావు? టీ అయినా తాగు. ఆకలి మీద ఉన్నట్లున్నావు. కొంచెం సేపు కూర్చుంటాము. వెలిపోదాం కాని''

కొప్పరోడి ఆకలి గుర్తుంచుకుని అడిగేసరికి ఉబ్బులింగడయిపోయేడు.

''పదండమ్మా ఎంతరొద్దు గభాల్నెలిపోదుము గాని. మరి నానిప్పుడు టీ నీలు తాగను'' మొహమాట పడిపోయేడు.

''సరే'' అని బయల్దేరారు.

ఆళ్ళంతా గొడుగులు క్రింద వున్నారు. కొప్పరోడికి కావిడి భారం భూమిలోకి దించుతుంటే ఆకలి కేకలు వేస్తూంది. స్వామి భక్తి మాత్రం ఊరి వైపు అడుగులు వేయిస్తూంది. ఎదురెండకి వడదెబ్బ తగులుతాదేమో అనిపిస్తుంటే చెవుల్లోంచి ఆవిర్లొస్తున్నాయి. ఊరు చేరుకున్నారు.

''ఏమమ్మా! ఇప్పుడొత్తన్నావు''

''....''

''ఏందమ్మా? బాగున్నావా, బాబు బాగున్నారా''

''ఆ... ఆ...''

''అమ్మా ఇదేనా రావడం''

''......''

''ఉసమ్మా మా వూరి మీద దయ గలిగిందా''

ఒక ముసలమ్మ అడుగుతూంది ప్రక్కమ్మని.

''నాయ్డు సిన్న కూతురా, పట్నంల ఉంతన్నరేటి''

''ఓసి! నువ్వెరగవేటి ఈ అమ్మిని నాయ్డు నడిపి కూతురు. యిశాపట్నంలుంతన్నారు'' ప్రక్కమ్మ సమాధానం.

ఊర్లో పలకరింపుల మధ్య ఇల్లు చేరుకున్నారు.

ఇల్లంతా సందడి, నవ్వులు, పలకరింపులు గందిక. కొప్పరోడు సామాన్లు ఇంట్లోపెట్టి గడపలో చేరబడిపోయేడు. అలసట తీరాక ఇంత అన్నము తినేసి, బీడీలుకి వీధిలోకి పోయేడు. కడుపులో నెప్పిలాగ అనిపించింది కొప్పరోడికి. 'ఆ... అదే పోతుందిలే' అనుకుని మెల్లగా ఊరుకుండి పోయేడు.

ఇంటికెళ్ళి మంచం మీద గడియ చేరబడుదుమని చేరబడ్డాడు. అంతే ఆ చేరబడ్డము మరి లేవలేదు.


ఎవరెవరో... ఊళ్ళో కొంతమంది చూడ్డానికొచ్చి, డాక్టరుకి చెప్పారు. డాక్టరంటే యం.బి. బి.యస్. కాదు. చిన్న ప్రాక్టీసు. పేరు దేవుబాబు అతని చెయ్యి మంచిదని ఆ వూరి ప్రజల నమ్మకం. దాని మీద ఆ ఊళ్ళో దేనికైనా చిన్నా, పెద్దా రోగాలను అతనే చూస్తుంటాడు. మనిషి మరీ డబ్బును చూసుకునే రకం కాదు. అతనొచ్చాడు.

''చూడండి బాపు పాపం నిన్నింతేలకి ఏనుగు నాగ తిరిగినోడు, ఈ పొద్దు ఏం మాయా రోగమొచ్చిందో పీనుగునాగ మంచానికతుక్కుపోయ్డు'' వైద్యుడితో ఎవరో చెప్పారు.

''అసలెప్పుడు మంచి వచ్చింది... ఇంకేమైనా అయ్యిందా?'' దేవుబాబు అడిగేడు అక్కడున్నవార్ని ఉద్దేశించి.

''బావు గుంటడు ఉడుకు రత్తం మంచి పొగరు మీదున్నాడు. ఎంత కట్టానికి శెలించడు. ఎండా, తిండి నెక్కసెయ్యడు. పాపం ఆడి ఖరమిలగొచ్చింది''

''అది కాదు బావు ఈడు నిన్న నాయ్డు బావు వంట సరుక్కని ''సిముడిమడ'' కొండ కెల్నాడు బావు. ఆ నీరు పడదని మామే ఆ కొండకెల్నానికి బెదిరిపోతాము బావు! అలాటిది కట్లెక్కువ దొరుకుతాయని ఈడక్కడ కెగబ డ్డాదు. ఆ రోజల్లా ఎండల బడి ఆ సెంట్రలు బస్సు కాడ సచ్చినాడు బావు. అందుకే టపీల్న



## సాహిత్యపు విలువ

మానసికమైన గొప్ప అవసరాల్ని తీరుస్తుంది కనకనే సాహిత్యానికి విలువ. మన జీవితాన్ని అనుభవించడానికీ, ఆనందించడానికీ, అర్థం చేసుకోటానికీ, వీటికి అనువుగా మన చేతనని (సెన్సిబిలిటీ) నిశిత పరుచుకోటానికీ సహకరిస్తుంది సాహిత్యం. ఇదే సాహిత్య విలువ.

— ఇస్మాయిల్

సేకరణ— ఈదుపల్లి

తిరగ్గేస్పినాది'' మరొకాసామి కారణాలు చెప్పేడు.

దేవుబాబు చెయ్యి చూపేడు. కొప్పరోడు మంచం మీద ఎగిరెగిరి పడుతున్నాడు.

''ఇదేదో మలేరియా జ్వరం లాగుంది, ఇంతంత వేగిరం తగ్గేరకం కాదు. చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎవ్వులైనా ఈడ్ని కనిపెట్టుకు నుండాలి.''

''... ... ...''

''ఒరే సోములా''

''అయ్యా''

''నువ్వెళ్ళి ఈలయ్యకి చెప్పి తీసుకురా ఈ డెలగున్నా అతడికేమీ పట్టదు,... ఓయ్ గుంపయ్యా నువ్వెళ్లి నాయ్డుతోని చెప్పవోయ్.''

ఆ లిద్దరూ ఆ పనులు మీద వెళ్ళారు.

''అందాక రెండింజక్షన్‌లు చేస్తాను. ఇగో ఈ మాత్రలు ఆ రాత్రెయ్యండి. వీటీ రాస్తాను. రేపెవులెలితే పట్నంల మందులు తెప్పించమని ఈలయ్యకి చెప్పండి. నే నొస్తాను మరి. ఇంకా ఊళ్ళో చూడాలి. నర్సయ్యకి కాళ్లు వాసిపోయాయుట. మంచం దిగలేడని నిన్నట్నుంచి కవుర్లు మీద కవుర్లు. ఈడ్ని జాగ్రత్తగా చూడండి పొద్దుట మల్లా వస్తాను.''

అనేసి దేవుబాబు వెళ్ళిపోయాడు.

కొప్పరోడి తండ్రొచ్చాడు వెంకునాయ్డు.

''అవును పకీరు ... పకీరో... 'ఏందిరా తోరగిండిపోనావు. ''ఊష్ణమా! ఒళ్లేడిగుంది. ఏటైనా తింతావురా... అవునోయ్ సోముల్దద్దా దేవుబాబు ఏటి తినమని సిప్పినాడోయ్... ఈ డస్పలు పలకుంతండు.''

''నాన్నేయ్ నాయ్డుబావుకి సెప్పనానికెల్నినాను. బావు నేడు. కిచ్చాడ భూమి సెట్లమెంటి కెల్నాడట. ఇంటి దగ్గర సెప్పేసి ఎలిపోచ్చినాను, నానొచ్చేసరికి దేవుబాబు ఎలిపోన్డు.''

''అయితేటి మ్మంతావు... ఇప్పడీడికి...'' జవాబు కోసం చూసేడు వెంకునాయ్డు.

''ఉడూకిది కసింత ఏపుడు జావ ఇత్తే మంచిది.''

''సోముల్దద్దా సిన్ను పకారం బాబ్బాబు... ఇలాగ గంగప్ప దగ్గరి కెళ్ళి నాన్పెప్పినానన్జెప్పి సెప్పదూ కసింత ఏపుడు జావ సేసిచ్చేత్తాది.''

''అలాగేన్నే... అలాగ సెప్పేసి ఇంటికెలి పోతాను. ఇంకా తిండి తిన్నేదు'' అని చెప్పేసి సోములు వెళ్ళిపోయేడు.

*　　*　　*

తరువాత మెల్లమెల్లగా కొన్నాళ్ళికి పకీరు చచ్చి బతికినట్లుగా కోలుకున్నాడు. ఊరంతా ముక్కు మీద వేలేసుకుంది. అంత విశ్వాసపాత్రుడు నమ్మిన బంటు, పకీరు సచ్చీజావులయిపోతే నాయ్డు కనీసం చూడ్డానికైనా రాలేదు. ఏదో ఆడోళ్ళు కంటితుడుపులాగ వొచ్చి ఎలిపోయేరు. నిమ్మకు నీరెత్తినట్లు మందుగానీ మాకు గానీ అన్లేదు. ఇదీ ఒకందుకు మంచిదీ అని సంతోషించారు కొంతమంది అసూయాపరులు. ఈ దెబ్బతో కోప్పరోడు మరి నాయ్డు గుమ్మం తొక్కడని ఆనందించేరు.

''గొడ్డువాగ సేకిరి సేయించుకుని పట్టెడు మెతుకులు పెట్టడం తప్ప సచ్చినావో బతికినావో సూన్నానికైనా రానేదు. సూసినావ్రా కొప్పరే... మీ నాయ్డు తాత'' కొంతమంది దెప్పి పొడిచేరు.

''ఒరే కోప్పరీ... కూలో నాలో సేసుకుని మీ అయ్యతోనే నుండి పైసో, పరకో ఎనకేసుకుని ఆయిగుండరా ఇకనైనా. మాయా మర్మం తెలీ నోడివి అక్కడ బండసేకిరి సేసి ఉడుకు రత్తం సెడగొట్టుకోక...'' అంటూ హితబోధ చేసారు కొందరు.

''మనం సెప్పాలేటి ఈ రుజువు ఆడెరగడా, ఇంకెల్తాడేటి...'' మరెవరో ... ఒక్కోరకంగా చెప్పేరు.

కొప్పరోడు లేచాడు. విసుగ్గా, విసురుగా లేచి దట్టి దులుపుకుని నాయ్డు ఇంటివైపు బయల్దేరాడు.

అందరూ సంతోషించారు. ఇప్పటికైనా నాయ్డుకి బుద్దిచెప్పొచ్చేస్తాడని మనిషో మాట ఆడుకోసాగేరు.

అందరూ ఒకేసారి ఆగేరు. ఆగలేదు విశ్చేష్టులయ్యారు. అలాంటి పని చేస్తాడని అనుకోలేదు. ఆశ్చర్యపోయేరు.

కోప్పరోడు కావడేసుకుని ఏటి వైపు సాగిపోయేడు. ఎప్పటిలాగే వాళ్ళ లక్ష్యం తనకేమీ కానట్లుగా. అందరూ ఒక్కో రకంగా అనుకున్నారు. అయితే వాళ్ళందరి కళ్ళలో లీలగా కదిలిన భావం ఒక్కటే. వాడిని చూసి. కసాయి వాడి వెనక అడుగులేస్తున్న మేకను చూపినట్లుగా వుంది వాళ్ళ చూపు. వాడు అలాగే మేకలా నడుస్తూ పోయేడు.


# తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగుచేసేందుకుగాను మా మందు కనిపెట్టబడింది. చికిత్సను గనుక పూర్తిగా పొందితే మచ్చల రంగుమారి శరీరానికి మును పటి రంగు తిరిగి వస్తుంది.

జబ్బు మొదళ్ళలో నుండి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారణకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతోసహా జబ్బు పూర్తి వివరాలను వ్రాయండి.

## తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టును డై చెయ్యనవసరం లేదు. మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టురాలిన ప్రదేశాన కొత్తజుట్టు వస్తుంది. ఇది మెదడును చల్లపరుస్తుంది. ఒక కోర్సులో 3 ఫైల్స్ ధర రూ. 80/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**Shyam Ayurved Bhavan(W.A.)**
**P.O. Katri Sarai (Gaya)**

# దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోనై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనంద భరితమైన సుఖాన్ని అనుభవించలేక పోతున్నారా...? అయితే రహస్యమైన మీ జబ్బుయొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలోగల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

**SHYAM AYURVED BHAVAN (A/GR)**
**P.O. KATRI SARAI (GAYA)**



కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్